క్లుప్తంగా

గోవుల రవాణా అడ్డుకోవాలి

భైంసాటౌన్: గోవుల అక్రమ రవాణాను అడ్డుకోవాలని గో సేవ గో సంరక్షణ విభాగ్ నాయకులు కోరారు. గురువారం పట్టణంలో భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్, ఆర్డీవో కోమల్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. బక్రీద్ సందర్భంగా గోవుల అక్రమ రవాణాకు అవకాశముందని.. పోలీస్ పికెటింగ్‌లు ఏర్పాటు చేసి అడ్డుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో సాదుల కృష్ణదాస్, గుజ్జుల్‌వార్ వెంకటేశ్, ఆకుల రంజిత్ తదితరులున్నారు.

రెండోరోజుకు బ్రహ్మోత్సవాలు



కుంకుమార్చనలో భక్తులు

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో ఉన్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. రెండో రోజైన గురువారం స్వామివారికి అలంకరణ, పుణ్యాహవచనం, కుంకుమార్చన, నిత్య హోమం, పూజలు, పల్లకి ఊరేగింపు నిర్వహించినట్లు పేర్కొన్నారు. వీడీసీ కోశాధికారి జిలకర వేణు, రైటర్ గంగాధర్, వీడీసీ సభ్యులు, వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

భాగ్యరెడ్డి వర్మ జయంతి



నివాళులర్పిస్తున్న కమిషనర్, సిబ్బంది

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం భాగ్యరెడ్డి వర్మ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ భాగ్యరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, రెవెన్యూ ఆఫీసర్ అనూప్‌కుమార్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాందలో అధిక వర్షం



వర్షపాతం పరిశీలిస్తున్న సీపీవో జీవరత్నం

లక్ష్మణచాంద: జిల్లాలోనే లక్ష్మణచాందలో అధిక వర్షపాతం నమోదైందని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జీవరత్నం పేర్కొన్నారు. గురువారం ఉదయం లక్ష్మణచాంద తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉదయం 8:30 గంటలకు ఆయన వర్షపాతం పరిశీలించి 99.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల గణాంక అధికారి రాథోడ్ నరేశ్, ఆర్ఐ నరేందర్‌రెడ్డి, ఫీల్డ్ టెక్నీషియన్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం నిషేధించాలి

తానూరు: మానవాళి ఆరోగ్యానికి నష్టం కలిగిస్తున్న ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ఎంపీడీవో నసీరొద్దీన్ సూచించారు. గురువారం మండలంలోని కోలూరులో పర్యటించారు. దుకాణదారులు, హోటళ్ల యజమానులు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. మురికి కాలువలను శుభ్రపరిచి వర్షపు నీరు నిల్వకుండా చూడాలన్నారు. గ్రామస్తులకు క్లోరినేషన్ నీటిని అందించాలన్నారు. పంచాయతీ నర్సరీ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పంచాయతీ కార్యాలయంలో స్టీల్ కప్పులు, ప్లేట్లు, సామగ్రి పరిశీలించారు. కార్యదర్శి తిరుపతిరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

భైంసారూరల్: మండలంలోని సుంక్లి గ్రామంలో ముత్యం ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని గురువారం ఎమ్మెల్యే రామారావుపటేల్ పరామర్శించారు. మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాన్ని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. విద్యుత్‌శాఖ నుంచి పరిహారం అందేలా చూస్తానని పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు సోలంకి భీంరావు, వెంగల్‌రావు, సత్యనారాయణరెడ్డి, రాజారెడ్డి తదితరులు ఉన్నారు.

రికార్డుల నిర్వహణలో అలసత్వం వద్దు

మామడ: గ్రామపంచాయతీల రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. శానిటేషన్, ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో అజిత్‌ఖాన్, ఎంపీడీఓ సుశీల్‌రెడ్డి, ఎంపీఓలు ఖలీం అహ్మద్, అమీర్‌ఖాన్ ఉన్నారు.

అధికారులూ.. ముందే స్పందించండి



భైంసారూరల్: మండలంలోని కామోల్ గ్రామ సమీపంలో రోడ్డు ఓ వైపు కోతకు గురైంది. ఈమార్గంలో రాత్రి రాకపోకలు సాగించే వాహనదారులు అదుపుతప్పి కిందపడుతున్నారు. వర్షాకాలంలో రోడ్డు మరింత దెబ్బతినే అవకాశం ఉంది. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు వేడుకుంటున్నారు.

క్రికెట్టు..ఇంట్రెస్టు





నిర్మల్‌ఖిల్లా: మిగతా ఆటలతో పోలిస్తే మన దేశంలో చిన్నారులు క్రికెట్ ఆటపై ఎక్కువ ఆసక్తి కనబరుస్తుంటారు. తల్లిదండ్రులు సైతం వారిని ప్రోత్సహిస్తూ అకాడమీల్లో చేర్పిస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలలకు వేసవి సెలవుల నేపథ్యంలో జిల్లాకేంద్రంలోని క్రికెట్ శిక్షణ కేంద్రాల్లో చిన్నారులు క్రికెట్ సాధన చేస్తున్నారు. శిక్షకుల పర్యవేక్షణలో తమ ప్రతిభకు మెరుగులు దిద్దుకుంటున్నారు. నిర్మల్‌లోని గాయత్రి టౌన్‌షిప్ సమీపంలో ఉన్న క్రికెట్ అకాడమీలోని దృశ్యాలివీ.

ముందే వచ్చిన ఆరుద్ర



లక్ష్మణచాంద: మండలంలోని తిర్పెల్లి గ్రామ సమీపంలో గురువారం ఉపాధిహామీ పనులు జరిగిన ప్రదేశం వద్ద ఆరుద్ర పురుగులు కనువిందు చేశాయి. జూన్ మాసంలో వచ్చే ఆరుద్ర కార్తె కంటే ముందుగా ఈ పురుగులు దర్శనమివ్వడం పంటల దిగుబడికి శుభసూచకమని పలువురు రైతులు పేర్కొంటున్నారు. పలువురు కూలీలు ఈ దృశ్యాలను తమ ఫోన్లలో బంధించారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి
- అభివృద్ధి పనుల నాణ్యతపై రాజీ వద్దు
- కలెక్టర్ అభిలాష అభినవ్, ఎమ్మెల్యే బొజ్జు పటేల్
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, పక్కన కలెక్టర్ అభిలాష అభినవ్, ఉన్నతాధికారులు

ఖానాపూర్: ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ అభిలాష అభినవ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. గురువారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో ఖానాపూర్, కడెం, పెంబి, దస్తూరాబాద్ మండలాలకు చెందిన అభివృద్ధి పనుల పురోగతి, సంక్షేమ పథకాల అమలుతోపాటు తదితర విషయాలపై వివిధ శాఖల జిల్లా, డివిజన్, మండలస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం అవకతవకలకు తావు లేకుండా అర్హులనే లబ్ధిదారులుగా ఎంపిక చేసి ప్రొసీడింగ్ కాపీలను అందజేయాలన్నారు. జిల్లాలో ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవడంతోపాటు ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం వేగవంతంగా చేపడుతున్నామని డీఏవో అంజిప్రసాద్ తెలిపారు.

ఖానాపూర్ మున్సిపాలిటీ పరిధిలో వార్డుల వారీగా సంక్షేమ పథకాల అమలుతోపాటు తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరిస్తున్నట్లు కమిషనర్ జాదవ్ కృష్ణ వివరించారు. రోడ్డు వైడింగ్(విస్తరణ) పనులపై కోర్టుకు వెళ్లిన వారికి ఫైనల్ నోటీసు లిచ్చి చర్యలు చేపడతామని కమిషనర్ తెలిపారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పలు అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలు నిర్మించడంతోపాటు అవసరమైన చోట మరమ్మతులు చేపడుతున్నామని సీడీపీవో సరిత వివరించారు. వర్షాకాలం నేపథ్యంలో వరదలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్, ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.

అటవీశాఖ అనుమతులకు సహకరించాలి..

పెంబి మండలం గుమ్మెన ఎంగ్లాపూర్‌తోపాటు కడెం మండలం అల్లంపల్లి, ఇతర గ్రామాల్లో రోడ్లు, వంతెనల నిర్మాణం కోసం అటవీశాఖ అనుమతుల కోసం సహకరించాలని ఎమ్మెల్యే, కలెక్టర్ అటవీ అధికారులను కోరారు. చేపట్టాల్సిన పనులకు అంచనాలు సిద్ధం చేసి తమకు నివేదించాలని నీటిపారుదల శాఖ అధికారులకు సూచించారు.

ప్రతి వారం సమావేశం నిర్వహించాలి..

ప్రతి గురువారం అటవీ, ఇరి గేషన్, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల అధికారులతో తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కడెం మండలం నవాబ్‌పేట్‌లో పట్టాలున్న సాగుదారుల సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే.. అటవీ అధికారులను కోరారు. పోడు భూముల హక్కు పత్రాలున్న రైతులకు సమస్యలు తలెత్తకుండా అధికారులు జాయింట్ సర్వే చేయాలని కలెక్టర్ అన్నారు. విద్యుత్ సమస్య లు పరిష్కరించాలని.. సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించకుండా చూడాలన్నారు.

సమస్యలుంటే తమ దృష్టికి తేవాలి..

ఖానాపూర్ ప్రాంతంలో సదర్మాట్ కాలువ, డిగ్రీ కళాశాల, రెవెన్యూ డివిజన్, తహసీల్దార్ కార్యాలయానికి, గ్రంథాలయానికి సొంత భవనం కావాల్సి.. ఇలాంటి సమస్యలుంటే అధికారులు తమ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ భూషన్, డీఎఫ్‌వో నాగినిభాను, ఆర్డీవో రత్నకల్యాణి తదితరులు ఉన్నారు.

విద్యుత్ అంతరాయం లేకుండా..



ఖానాపూర్: మండలంలో బుధవారం రాత్రి గాలి, వాన కారణంగా గోసంపల్లె, పాత ఎల్లాపూర్, గోడలపంపు, కొత్తపేట, బావాపూర్(కె), దిలావర్‌పూర్ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గోసంపల్లె-రాంరెడ్డిపల్లె మధ్య పొలాల్లోని ఓ విద్యుత్ స్తంభంపై ఇన్సులేటర్ పోయినట్లు సిబ్బంది గుర్తించారు. అధికారుల ఆదేశాల మేరకు ఏఎల్ఎం నర్సయ్య రాత్రే ఇన్సులేటర్ వేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించాడు.

కూలీలకు ఉపాధి పనులు కల్పిస్తాం

- చేపలు, కోళ్ల పెంపకంపై దృష్టి సారించాలి
- ప్రజావేదికలో డీఆర్డీవో విజయలక్ష్మి



మాట్లాడుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

కుంటాల: ఉపాధిహామీ పథకం కింద గ్రామాల్లో అర్హులందరికీ పనులు కల్పిస్తామని.. కూలీలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో విజయలక్ష్మి పేర్కొన్నారు. గురువారం కుంటాల రైతువేదికలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించిన 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఇందులో ఆయన పాల్గొని మాట్లాడారు. అవకతవకలకు ఆస్కారం లేకుండా పనులు చేసిన కూలీలకు తమ బ్యాంక్, పోస్టాఫీసు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నట్లు వెల్లడించారు. గ్రామాల్లో భూగర్భజలాలు పెంచేందుకు ఇంకుడుగుంతలు నిర్మించాలని కోరారు. ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు చేపల చెరువులు, కోళ్ల పెంపకంపై దృష్టి సారించాలని సూచించారు. 2024–25లో చేపట్టిన రూ.5 కోట్ల 30 లక్షల విలువైన పనుల్లో నిధులు దుర్వినియోగం కాకుండా సక్రమంగా పనులు చేయించినందుకు ఏపీవో గట్టుపల్లి నవీన్, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ మేనేజర్ సుధాకర్, అంబుడ్స్ మెన్ నవీన్, విజిలెన్స్ అధికారి లక్ష్మణ్, ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో ఎంఏ రహీంఖాన్, పీఆర్ ఏఈ గౌరీష్, క్వాసీ కృపాకర్, సోషల్ ఆడిట్ ఎస్ఆర్పీ మహేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల పొట్ట కొడుతున్న వర్షం



ఖానాపూర్‌లోని గోదావరి ప్రాంతంలో నేలకొరిగిన వరి పొలం



రాచాపూర్‌లో టార్పాలిన్లు కప్పుతున్న రైతులు



సోన్‌లో కేంద్రం వద్ద బురదమయంగా ధాన్యం



పెంబి: మందపల్లి కొనుగోలు కేంద్రంలో వరదకు కొట్టుకుపోయిన ధాన్యం

- కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం కుప్పలు
- తల్లడిల్లుతున్న అన్నదాతలు

లక్ష్మణచాంద: అకాల వర్షం రైతుల పొట్ట కొడుతోంది. ఆరుగాలం పడ్డ కష్టం వరుణుడి పాలవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం రాత్రి కురిసిన వర్షంతో లక్ష్మణచాంద మండలంలో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. మళ్లీ గురువారం మధ్యాహ్నం నుంచి వర్షం కురవడంతో రైతులు పంటను కాపాడుకునేందుకు నానా తంటాలు పడ్డారు. రాచాపూర్ గ్రామ కొనుగోలు కేంద్రంలో గన్నీ సంచుల కొరత, లారీలు రాక పంటను తూకం వేయడం లేదని.. అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. మండలకేంద్రంలోని కొనుగోలు కేంద్రాలకు సరిపడా లారీలు రాక.. తూకం వేసిన బస్తాలను ఒక చోట వేయించి.. ఒక్కో బస్తాకు రూ.5 చెల్లించి వాటిపై టార్పాలిన్లు కప్పిస్తున్నారు. అసలే 40 కేజీల సంచికి 3 కేజీల ధాన్యం కట్ అవుతుందని.. ఇప్పుడు మళ్లీ పంటను కాపాడుకునేందుకు అదనంగా ఖర్చు చేస్తున్నామని పేర్కొంటున్నారు.

కుంటాల: కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యం తడవకుండా రైతులు టార్పాలిన్లు కప్పారు. త్వరగా ధాన్యాన్ని తరలించాలని రైతులు కోరుతున్నారు.

పెంబి: మండలంలోని పలు గ్రామాల్లో అకాల వర్షానికి వడ్లు కొట్టుకుపోయాయి. కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి నెల దాటినా తూకం వేయడం లేదని రైతులు వాపోతున్నారు.

సోన్: మండలంలో అకాల వర్షంతో సోన్, న్యూవెల్మల్, బొప్పారం మాదాపూర్, పాక్‌పట్ల, సిద్దులకుంట జాఫ్రపూర్, లోకల్‌వెల్మల్ గ్రామాలలో ధాన్యం తడిసిపోయింది. నిర్వాహకుల జాప్యంతోనే కేంద్రాల్లో పంట తడిసిపోయిందని రైతులు పేర్కొన్నారు.

ఖానాపూర్: కొనుగోలు కేంద్రాల్లో పంట తడిసిపోవడంతోపాటు గోదావరి తీర ప్రాంతంలోని పలు గ్రామాల్లో వరిపొలాలు నేలకొరిగాయి. అకాల వర్షాలతో నష్టపోయిన వారికి ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

తడిసిన ధాన్యం కొంటాం



చించాలలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీలత

ముథోల్: రైతులెవరూ ఆందోళన పడొద్దని.. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తహసీల్దార్ శ్రీలత పేర్కొన్నారు. గురువారం మండలంలోని చించాల, వెంకటాపూర్, ఎడ్‌బిడ్ గ్రామాల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా కేంద్రాల నిర్వాహకులతో మాట్లాడి పలు వివరాలు తెలుసుకున్నారు. కొనుగోళ్లలో జాప్యం లేకుండా వెంటనే తూకం వేసి లారీల్లో ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని ఆదేశించారు. అనంతరం రైతులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ నారాయణ్‌రావుపటేల్, కేంద్రం నిర్వాహకులు, రైతులు ఉన్నారు.

ఇనాం భూముల సాగుకు వేలం

తానూరు: మండలకేంద్రంలో ఉన్న ఇనాం(వక్ఫ్ బోర్డు) భూములను ఏడాది పాటు సాగు చేసేందుకు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ లింగంమూర్తి ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. తానూరు గ్రామ శివారులో 37 సర్వేనంబరులో 19.6 ఎకరాల భూమి ఏడాది సాగు చేసేందుకు వేలంలో రూ 2.29 లక్షలు, 92 సర్వే నంబర్‌లో 92.17 ఎకరాలకు రూ.37 వేలు, 191 సర్వేనంబర్‌లో 54.12 ఎకరాల భూమికి రూ.3.06 లక్షలు వేలంపాటలో ధరలు నిర్ణయించినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. వేలంద్వారా 165.35 ఎకరాల భూమికి రూ.5,72 లక్షల ఆదాయం సమకూరిందని తెలిపారు. ఆర్ఐ మోహన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ప్రవేశపరీక్షలో ప్రతిభ



శార్విన్‌రెడ్డి



రోహిత్

దిలావర్‌పూర్: మండలంలోని గుండంపల్లి గ్రామానికి చెందిన సాలాయిగారి కోమల–శేఖర్‌రెడ్డి దంపతుల కుమారుడు శార్విన్‌రెడ్డి సైనిక్ స్కూల్‌లో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షలో ప్రతిభ కనబరిచాడు. జాతీయస్థాయిలో 213వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో ఆరో ర్యాంకు సాధించాడు.

కుంటాల: దేశంలో ఉన్న 33 సైనిక్ స్కూళ్లలో ప్రవేశం కోసం ఏప్రిల్ 5న పరీక్ష నిర్వహించగా గురువారం ఫలితాలు విడుదలయ్యాయి. మండలంలోని కల్లూరు శ్రీ సాయిమోడల్ పాఠశాల విద్యార్థి కసురె రోహిత్ జాతీయస్థాయిలో 148వ ర్యాంకు, రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు, జిల్లాస్థాయిలో ఒకటో సాధించారని ప్రిన్సిపాల్ శ్రీకాంత్ తెలిపారు. రాతపరీక్ష మార్కులు, కౌన్సెలింగ్ ద్వారా సీట్ల ఎంపిక ఉంటుందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థిని పలువురు అభినందించారు.

ఖానాపూర్‌లో ఎక్స్‌రే మిషన్ ప్రారంభం

ఖానాపూర్: పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)కి రూ.15లక్షలతో మంజూరైన డిజిటల్ ఎక్స్‌రే మిషన్‌ను గురువారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప్రారంభించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని.. ప్రజలకు ప్రైవేటుకు వెళ్లి ఇబ్బందులు పడొద్దని సూచించారు. ఖానాపూర్ ఆస్పత్రిలో సౌకర్యాలు, వైద్యులు, సిబ్బంది కొరతపై సమగ్ర నివేదిక అందజేయాలని డీసీహెచ్ సురేశ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ వంశీమాధవ్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లోని సమస్యలను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు భూషన్, మాజిద్, దయానంద్, చిన్నం సత్యం, గంగనర్సయ్య, తోట సత్యం, మడిగెల గంగాధర్, శ్రీనివాస్, శోభన్, తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

తడిసిన ధాన్యం కొనాలి

నిర్మల్‌రూరల్: అకాల వర్షాలకు తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లాకేంద్రంలోని మంజులాపూర్ కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని వారు పరిశీలించారు. డాక్టర్ సుభాశ్‌రావు, పార్టీ నాయకులు మారుగొండ రాము, జీవన్‌రెడ్డి, లక్ష్మణచారి, విఠల్, ప్రశాంత్, చిన్నయ్య, లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

మహిళలు శుభ్రత పాటించాలి

నర్సాపూర్(జి): మహిళలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఏపీఎం సునంద అన్నారు. మండల కేంద్రంలోని మల్లికార్జున సమాఖ్య కార్యాలయంలో సెర్ప్ ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా శానిటరీ ప్యాడ్ల వినియోగం, తీసుకోవాల్సిన పోషకాహారం వివరించారు. జిల్లా సమన్వయకర్త ప్రవీణ్, సీసీలు సందేశ్, ముత్యం, మహిళలు పాల్గొన్నారు.

బోధనతీరు మెరుగుపడాలి

కుంటాల: విద్యాబోధనలో ఉపాధ్యాయుల బోధన తీరు మరింత మెరుగుపడాలని ఎంఈవో ముత్యం పేర్కొన్నారు. మండలంలోని కల్లూరు ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను గురువారం పర్యవేక్షించి మాట్లాడారు. ఉపాధ్యాయులు శిక్షణను సద్వినియోగం చేసుకొని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనలో మాజీ మంత్రి

లక్ష్మణచాంద: మండలంలోని న్యూకంజర్ గ్రామ హనుమాన్ ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించగా మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఐకేరెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో అల్లోల సురేందర్ రెడ్డి, రఘునందన్‌రెడ్డి, రమేశ్, ఓస రాజేశ్వర్, సురేష్, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో 'బాలశక్తి' అమలు చేయాలి

నిర్మల్‌రూరల్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో బాలశక్తి కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సౌమ్య పేర్కొన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని విజయ హైస్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించగా ఆమె హాజరై మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాలతో జిల్లాలోని 57 సంక్షేమ పాఠశాలల్లో బాలశక్తి ప్రవేశపెట్టి విజయవంతం చేశామన్నారు. బాలశక్తిలో ఉన్న ఆరోగ్యం–పరిశుభ్రత, ఆర్థిక అక్షరాస్యత, నైపుణ్యాభివద్ధి, విజ్ఞాన విహారయాత్రలు మొదలైన అంశాలను వివరించారు. ప్రతి విద్యార్థికి హెల్త్ ప్రొఫైల్ తయారు చేసి అన్ని వివరాలు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం జిల్లాలోని 118 ప్రభుత్వ పాఠశాలల్లో బాలశక్తి అమలు చేస్తామని.. వ్యాయామ ఉపాధ్యాయులు సహకారం అందించాలని కోరారు. ప్రవీణ్‌కుమార్ ,లింబాద్రి, శ్రీనివాస్, భూమన్న, జమున, అన్నపూర్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొదలైన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

నిర్మల్ రూరల్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ స ప్లిమెంటరీ పరీక్షలు గురువారం జిల్లాలో ప్ర శాంతంగా ప్రారంభమయ్యాయి. ఫస్ట్ ఇయర్ ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండియర్ పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి ఐదు గంటల వరకు నిర్వహించారు. ఫస్ట్ ఇయర్లో మొత్తం 1,464 మందికి 1,371 మంది హాజరయ్యారు. 93 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కేటగిరీలో మొత్తం 179 మంది విద్యార్థులకు 169 హాజరయ్యారు. సెకండియర్‌లో మొత్తం 385 మంది విద్యార్థుల కు 354 మంది హాజరయ్యారు. 31 మంది గైర్హాజరయ్యారు. జనరల్ కేటగిరీలో 360 మంది వి ద్యార్థులకు 330 మంది హాజరవగా, 30 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కేటగిరీలో 25 మందికి 24 మంది హాజరయ్యారు. ఒకరు గైర్హాజరైనట్లు డీఐఈవో పరశురామ్ తెలిపారు.

సన్మానం

లోకేశ్వరం: నూతన తహసీల్దార్ సర్ఫరాజ్ హైమద్‌ను గురువారం తన కార్యాలయంలో మండలంలోని రేషన్ డీలర్లు కలిసి సన్మానించారు. రేషన్ డీలర్ల మండలాధ్యక్షుడు కొప్పెల సాయారెడ్డి, మారుతి, రవీందర్‌రావు, గంగన్న, భూమన్న, నర్సింగ్‌రావు, మురళీధర్‌రావు ఉన్నారు.

ముథోల్: నూతన తహసీల్దార్ కె. శ్రీలతను గురువారం రేషన్ డీలర్లు సన్మానించారు. కార్యక్రమంలో డీలర్లు భూమన్న, మల్లేశ్, భోజరాం, అశోక్, గంగాధర్, పోతారెడ్డి, తదితరులున్నారు.